
# సుబ్బారావు విమానం ఎక్కాడు!

వి.వి.ఎల్. సావిత్రి

"మీ బిడ్డకు పోలియో టీకా వేయించారా? లేకుంటే మీ దగ్గరలోనున్న మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సంప్రదించండి" అంటూ దూరదర్శన్‌లో ప్రకటనల హోరు ఆరంభమైంది. సుబ్బారావు టివి చూస్తున్నాడు. సాయంత్రం ఆఫీసు నుండి రాగానే టివి చూడటం సుబ్బారావు హాబీ. కాఫీ కప్పుతో ప్రత్యక్షం అయిన భార్య అచ్యుతం ఆ కాఫీని మొగుడి ముఖాన కొట్టి తక్కున టివి చానెల్ తిప్పింది.

"తరంగ్ టివి ఛానెల్‌లోనూ, సూపర్ ఛానెల్‌లోనూ అన్ని మంచి ప్రోగ్రాంలొస్తుంటే ఎపుడు చూసినా ఆ వెధవ దూరదర్శన్‌లో ఏం బావుంటుందో? బొత్తిగా టేస్టుల్లేని మొహాన్ని చేసుకుని నాశనమైపోయాను " అంటూ మొగుడు వినే పనార్థాలు పెట్టింది అచ్యుతం.

అచ్యుతం మధ్య తరగతి మామూలు గృహిణి. అయితేనేం దర్జా వెలగబెట్టనిదే ఈ రోజుల్లో ఎవరూ మొహం చూడరని ఖచ్చితంగా నమ్మే మనిషి. అందుకే సినిమాల్లో వచ్చే లేటెస్టు చీరలని ఎప్పటికపుడు మొగుడి ప్రాణం తీసైనా సరే కొనిపించుకుంటుంది. క్రమం తప్పకుండా బ్యూటీ పార్లర్‌ని సందర్శించి తన సౌందర్యాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తుంది. తల్లి దండ్రి ప్రేమతో పెట్టిన పేరు కాబట్టి దానిని మార్చుకోలేక పోయింది గానీ మిగతా వన్నీ అంటే కట్టు , బొట్టు , మాటతీరు అన్ని చాలా ఆధునికంగా ఉండాలని ఉబలాటపడుతుంది. పెరిగింది పల్లెటూళ్ళో అయినా పట్న నికి ఏమాత్రం తీసిపోకుండా ఉండేందుకు తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది అచ్యుతం.



టివిలో ఏదో మంచి ప్రోగ్రాం అయిపోయింది. ఆఖరుగా అడిగే కొసరు ప్రశ్న అడిగింది అనౌన్సర్.

"దీనికి మీ సమాధానం వారం రోజుల్లోగా మాకు రాయండి. ఉచితంగా దేశ వ్యాప్తంగా అన్ని ముఖ్య ప్రదేశాలలోనూ వారం రోజులు ప్లెషర్ ట్రిప్ టిక్కెట్లను గెల్చుకోండి. గెలిచిన వారితో పాటు మరొకరు కూడా మా కంపెనీ ఏర్పాటు చేసిన ఆతిథ్యాన్ని స్వీకరించి దేశమంతా ఉచితంగా వినోద ప్రయాణం చేయండి "అని మాయమయ్యింది అనౌన్సర్.

అచ్యుతం ఆసక్తితో మరో ఛానెల్ తిప్పింది. అక్కడ కూడా ఓ సీరియల్ అయిపోయి ముక్తాయింపుగా కొసరు ప్రశ్నలు సంధించింది అక్కడి ఎనౌన్సర్. అచ్యుతం ఆనందానికి అవధులు లేవు. రెండూ ఆమెకు తెలిసిన సమాధానాలే.

"దీనికి సమాధానం నాకు తెలుసు. రేపు ఆఫీసు నుండి వచ్చేటపుడు ఒక అరడజను కార్డులు కొని పట్టుకు రండి" ఆర్డరు వేసింది అచ్యుతం భర్తకి.

"టివి పోటీలకు వాడే కార్డుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇపుడెందుకులే అచ్యుతం. మనం గెలుస్తామా, ఏవన్నానా?" అని సణిగిన సుబ్బారావుకి గట్టిగా డోసు ఇచ్చింది అచ్యుతం.

"మీ సిగరెట్లకి తగలెయ్యగా లేనిది బోడి కార్డు కొనమంటే ఎందుకంత ఏడుపు? వేధవ్వేషాలేయకండి , నాకు చిరాకు "అని రుస రుసలాడుతూ మరో ఛానెల్ తిప్పింది. సూపర్ ఛానెల్‌లో కూడా సినిమా పాటలు చూపించి ప్రశ్నలు అడిగారు. ఒక చిత్రంలోని పాట చూపించి ఆ పాట ఏ చిత్రంలోదో ఎవరు పాడారో , సంగీతం ఎవరిదో వివరాలని వారం రోజుల్లోగా రాసి పంపిస్తే బొంబాయి, కాశ్మీర్‌లలో ఉచితంగా రెండేసి రోజులు గడిపే అద్భుత అవకాశం. గెలుచుకున్న వారితో పాటు మరొకరు ఉచితంగా ప్రయాణించవచ్చు. తప్పక రాస్తారు కదూ అంటూ ఊరించింది మరో అనౌన్సర్. సినిమాల పరిజ్ఞానం బాగా ఉన్న అచ్యుతం సుబ్బారావుని కార్డుల కోసం వేధించుకుతింది. సుబ్బారావు పరమ సాత్వికుడు. భార్య అంతలా అధికారం చెలాయిస్తున్నా ఆమె మీద ప్రేమే. మరుసటి రోజు గుర్తుంచుకునిమరీ కార్డులు కొనుక్కొచ్చి భార్యప్రేమని గెలుచుకున్నాడు. ఉత్సాహంతో టివి ఛానెళ్ళన్నింటినీ తనివి తీరా చూసి ఆరు కార్డులు నింపి పోస్టులో పడేసింది.ఒక పదిహేను రోజులు హుషారుగానే గడిచాయి. ఆ తర్వాతే సుబ్బారావుకి కష్టాలు, అచ్యుతానికి ఆనందం ఒక్కసారిగా తన్నుకొచ్చాయి. అచ్యుతం రాసిన సమాధానం లక్కీడిప్‌లో గెలుపొందినట్లు టివి ప్రోగ్రాంని స్పాన్సర్ చేసిన కరన్సన్ కంపెనీ వారు వివరాలతో ఉత్తరం రాసారు. తొందరలోనే వారికి ప్రయాణపు టిక్కెట్లు ఇతర వివరాలతో కూడిన సమాచారాన్ని పంపిస్తామని ఉందా సందేశంలో. ఆనందం పట్టలేని అచ్యుతం మొగుడ్ని పట్టుకు ముద్దాడింది.

"మన అదృష్టం చూడండి ఎలా తన్నుకొచ్చిందో. నన్ను చేసుకున్నాక మీకంతా కలిసొచ్చింది. వారం రోజుల పాటు ప్లెజర్ ట్రిప్ అంటే మాటలా? మీరు పదిజన్మలెత్తినా నన్ను కాశ్మీర్ తీసుకు వెళ్ళలేరు. మీ బోడి క్లర్కు ఉద్యోగానికి అంత సీన్ లేదుగా?" అంటూ సరదాగా ఆటపట్టించింది. " మీరు నన్ను హనీ మూన్‌కి తీసుకెళ్ళక పోయినా నేనే మిమ్మల్ని హనీమూన్‌కి తీసుకెడుతున్నాను "కళ్ళు గిరగిరా తిప్పుతూ చెప్పింది అచ్యుతం.

"వాళ్ళు ఉచితంగా తిప్పినా ఎంజాయ్ చేయడానికైనా డబ్బులుండాలి కదా?" అన్నాడు సుబ్బారావు. అంతే అచ్యుతం తారాజువ్వలా లేచిపోయింది." పెళ్ళయ్యాక ఒక ముద్దా ముచ్చటా? మిమ్మల్ని కట్టుకుని నేనేం సుఖపడ్డాను? అసలు మీ అక్కసంతా నేను ప్రెయిజ్ గెలుచుకున్నందుకేగా? ఆడది గెలవడమేమిటి? మనం దాని కూడా వెళ్ళడమేంటి అనే అహంకారం" అని కసితీరా తిట్టింది. ముక్కు చీదింది. రెండు రోజులు వంట గుమ్మం ఎక్కలేదు. సుబ్బారావుకి కడుపు మాడడం మినహా ఉపయోగం లేకపోయింది. అచ్యుతం మౌనవ్రతం , పెదవి విరుపులు భరించడం కష్టమైంది. విషయం ఆఫీసులో సన్నిహితులకి చెప్పాడు.

"మంచి ఛాన్సు వదులుకోకు. జన్మలో వెళ్ళిరాలేవు. వెళ్ళిరా." అంది మిత్ర బృందం. పుట్టింటికి, అత్తింటికి విషయం వివరిస్తూ ఉత్తరాలు రాసిన అచ్యుతానికి వారం రోజులు తిరగకుండానే ఎలాగోలా వెళ్ళిరమ్మని ఉత్తరాలు వచ్చాయి. అవి సుబ్బారావు మొహాన పడేసింది. అందరూ ఇంతలా చెప్పడంతో సుబ్బారావు కూడా కొంచెం ఉత్సాహపడ్డాడు. మిత్రులని కలిసాడు. డబ్బు సేకరించాడు. కరన్సన్ కంపెనీ నుండి టిక్కెట్లు ప్రయాణ వివరాలతో కూడిన సమాచారం రానే వచ్చింది. సుబ్బారావు, అచ్యుతంల ఆనందానికి హద్దేలేదు. ముందుగా బొంబాయి వెళ్ళి అక్కడ రెండు రోజులు గడిపి,

అక్కడి నుండి కాశ్మీర్ వెళ్ళడం. అక్కడ రెండు రోజులు గడిపి తిరిగి వెనకకి రావడం, ఆ ప్రదేశాల్లో వసతి ఖర్చులు విమాన ప్రయాణ ఖర్చులు కరన్సన్ కంపెనీ భరిస్తుంది. కరన్సన్ కంపెనీ పంపిన టిక్కెట్ల లో ప్రయాణ తేదీ నాలుగు రోజుల్లోఉంది. దాంతో సుబ్బారావు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు మొదలు పెట్టాడు. అప్పుచేశాడు. ఆఫీసులో బాస్‌ని సంతృప్తి పరిచి వారం రోజులు లీవ్ శాంక్షన్ చేయించుకున్నాడు. అచ్యుతం ఇంటి చుట్టుపక్కల వారికి వారం రోజులు ఇల్లు జాగ్రత్త అని చెప్పింది. విమాన ప్రయాణం ఎలా వుంటుందో అప్పటి వరకూ తెలియని అచ్యుతం తినడానికి జంతికలు, చెగోడీలు లాంటి సరంజామా చేసి మూటలు కట్టింది. సుబ్బారావుకి వళ్ళు మండి పోయింది.

"మనమేం ఎర్రబస్సెక్కి రావికమతం వెళ్ళడం లేదు. ఏమిటా మూటలు. తీసిపడేయ్. విమానం ఎక్కడానికి హోదా వుండాలి. మనలాంటి వాళ్ళకి అవకాశం వస్తే ఇలానే ఉంటుంది " అని విసుక్కున్నాడు.

విమానానికి గంట టైమ్ వుందనగా బయలు దేరారు. చాదర్ ఘాట్ దగ్గర ట్రాఫిక్ జాం. విమానాశ్రయానికి చేరుకుని లాంజ్‌లో కూర్చున్నారు.

సరిగ్గా అపుడే వినిపించిందో ప్రకటన. కేంద్ర రక్షణ మంత్రి అర్జంటుగా అక్కడ లాండ్ అయి వేరే విమానంలో మరో ప్రదేశానికి వెడుతున్నందున బొంబాయి బయలుదేరాల్సిన విమానం ఆరు గంటలు ఆలస్యంగా బయలుదేరుతోంది అని. సుబ్బారావుకి టెన్షన్. భార్యని అక్కడ కూర్చోబెట్టి ఎంక్వైరీలో కనుక్కున్నాడు. ఇంటికి తిరిగి వెళ్ళే ఓపిక లేక ఆ ఆరు గంటలు అక్కడే గడిపి విమానం ఎక్కారు. విమాన ప్రయాణ అనుభూతిని పూర్తిగా అనుభవించకుండానే బొంబాయిలో దిగారు. కంపెనీవారు రూం బుక్ చేసిన షెరాటన్ హోటల్ ఎక్కడుందో తెలుసుకోవడం ఇబ్బందైంది. సుబ్బారావుకి హిందీ రాదు. టాక్సీ వాలాకి ఇంగ్లీషు రాదు. టాక్సీ వాడు ఊరంతా తిప్పేస్తున్నాడు. మీటరు గిర్రున తిరిగిపోతోంది. సుబ్బారావులో టెన్షన్ అదే మోతదులో పెరిగిపోతోంది.

చిట్టచివరికి ఒక పోలీస్ కానిస్టేబుల్ సహాయంతో ఆ హోటల్ ఎడ్రస్ పట్టుకుని చేరుకున్నారు. ఎనిమిది గంటలు ఆలస్యంగా వచ్చినందున ఆ రూం కాన్సిల్ అయిపోయినట్టేనని అడ్వాన్స్ చెల్లించి మరో రూం బుక్ చేసుకోమని చెప్పాడు రిసెప్షనిస్ట్. కరన్సన్ కంపెనీ గురించి తమ ప్రయాణం గురించి చెప్పి చెప్పి సుబ్బారావుకి చెమటలు పోశాయి. కానీ రిసెప్షనిస్టు కొంచెం కూడా కరగలేదు. పైగా వారి హోటల్ రూల్స్ వేరంటూ ఒక పెద్ద బ్రోచర్ పడేశాడు సుబ్బారావు ముందు.

"ఇంతదూరం వచ్చాక తటపటాయిస్తారెందుకూ. తీయండి డబ్బులు. ఎలాగూ వచ్చాం కదా" ఆదేశించింది అచ్యుతం.

నీరసంగా డబ్బు చెల్లించి రూంలో పడ్డారు. నిమిషాల్లో కాఫీ అందించాడు బోయ్.

"ఏం వినయం? ఫైవ్ స్టార్ హోటళ్ళని కాదు కానీ. మర్యాదలకు లోటుండదోయ్ " అన్నాడు సుబ్బారావు.

గీజర్ ఆన్ చేసి. స్నానం చేసి కూర్చునే సరికి రాత్రి తొమ్మిది కావడంతో-

"ఇపుడెక్కడికి వెడతాం లెద్దూ. రేపు సాయంత్రం వరకూ షాపింగ్ చేద్దాం. ఆ మర్నాడు పొద్దునే ఇక్కడినుండి కాశ్మీర్‌కు విమానం ఉంది. మళ్ళీ మిస్ అయితే ప్రమాదం గుర్తుంచుకో సుమా "అంటూ భార్యకి ఆజ్ఞాపించి పడుకున్నాడు.

పడుకున్నాడే గానీ నిద్ర రావడం లేదు. పొద్దుట్నుంచి టాక్సీకి , అదనంగా హోటల్ రూంకి అయిన ఖర్చు తలచుకుంటే బిపి పెరిగిపోతోంది.

* * *

"ఈ రోజు సాయంత్రం వరకూ షాపింగ్ చేద్దాం. రేపు ఉదయమే కాశ్మీర్ ఫ్లైట్. నాల్గింటికి నిన్ను హోటల్ రూంలో దింపి నేను ఎయిర్ పోర్టుకి వెళ్ళి విమానం టైమింగ్స్ మిగతా వివరాలు కనుక్కొని వస్తాను "

దాదాపు ఆజ్ఞాపించినట్లుగా చెప్పాడు సుబ్బారావు. అచ్యుతం మూతి ముప్పై వంకరలు తిప్పి బయలు దేరింది. షాపింగ్‌లో ఏమీ కొననివ్వడు. డబ్బు ఖర్చయిపోయిందన్న నణుగుడుతో అచ్యుతానికి విసుగొచ్చింది. నాల్గింటికి భార్యని హోటల్ రూంలో దించి ఏరోడ్రంకి బయలు దేరాడు సుబ్బారావు. శాంతాక్రజ్ విమానాశ్రయం చూడగానే దడ పుట్టింది. గిర్రున తిరిగిన టాక్సీ బిల్లుని గుండె బరువుతోనే చెల్లించి లోపలికి నడిచాడు. ఎంక్వైరీ కౌంటర్‌లో తన సొద మళ్లీ వినిపించాడు. మౌనంగా విన్న ఆ వ్యక్తి ఎంతో జాలిగా సుబ్బారావుని చూసాడు. ఆ జాలి చూపులని తట్టుకోలేక పోయాడు సుబ్బారావు. మళ్ళీ ఏదో జరగబోతోందని అంతరాత్మ చూచాయగా చెప్తోంది. అయినా గుండె దిటవుతో విన్నాడు.

కాశ్మీర్‌లో గత రెండు రోజుల నుండి మంచు తుఫాన్ మొదలయిందని రేపటి నుండి నాలుగు రోజుల పాటు విమాన సర్వీసులన్నీ కాన్సిల్ చేశారని, వెడితే ఇవాల్టి ఈవినింగ్ ఫ్లయిట్‌కి వెళ్ళి పొమ్మని సలహా ఇచ్చాడు కౌంటర్‌లోని వ్యక్తి.

సుబ్బారావు మొహంలో కత్తి వాటుకి నెత్తురు చుక్క లేదు. అడుగడుగునా తన సహనాన్ని పరీక్షిస్తున్న సంఘటన లెదురవుతుండటంతో అచ్యుతం మీద పీకల దాకా కోపం వచ్చేస్తోంది. కాళ్ళీడ్చుకుంటూ హోటల్‌కి బయలు దేరాడు. భార్యని విసుక్కున్నాడు. మూటా ముళ్ళు సర్దాడు. ఆదరా బాదరా ఆ విమానం ఎక్కారు.

దాదాపు గంటన్నర తర్వాత కాశ్మీర్‌లో మంచు తుపాన్ మధ్య దిగింది విమానం. ఎముకలు కొరికే చలి. వెంట తెచ్చుకున్న దుప్పట్లు రగ్గులు చాలటం లేదు. అలాగే టాక్సీ ఎక్కి కరన్సన్ కంపెనీ చెప్పిన హోటల్‌కి బయలు దేరారు. విపరీతమైన చలిగా ఉన్నా ఆహ్లాదంగా ఉన్న ఆ ప్రకృతి దృశ్యాలు చూసి అచ్యుతం మనసు అతిగా స్పందిస్తోంది. భర్త వైపుకి జరిగింది వెచ్చదనం కోసం. చుర్రుమని చూసాడు సుబ్బారావు. ఆ చూపులకే శక్తి వుంటే అచ్యుతం మాడి మసైపోయేది. మాట్లాడకుండా పక్కకి జరిగింది అచ్యుతం. పెద్ద పెద్ద జలపాతాలు, అందమైన పువ్వులు. గార్డెన్‌లు చూసినపుడల్లా ఏదో మాట్లాడాలని అచ్యుతం ఆరాటం. భర్త వైపు చూసింది.

సుబ్బారావు తనలో తనే ఏదో తిట్టుకుంటూ నిలువు గుడ్లేసుకుని టాక్సీ మీటర్ వైపే చూస్తున్నాడు. మీటర్ తిరిగినపుడల్లా సుబ్బారావు గుండెల్లో విచిత్రమైన బాధ. బిల్లెంతవుతుందోనని ఆందోళనపడుతున్నాడు. ఇంట్లో అలాంటి ఫీలింగ్ పెడితే సుబ్బారావు మొహం పచ్చడయ్యేది. కానీ సరదాగా మొదలైన ఉచిత ప్రయాణంలో ఎదురైన పదనిసలు అచ్యుతం నోరు మూయించేసాయి. లేకుంటే సుబ్బారావు పని అయిపోయేది.

మొత్తానికి ఒక అరగంట తర్వాత కరన్సన్ వారు బుక్ చేసిన హోటల్ వచ్చింది. దిగి బిల్లు చెల్లించి రిసెప్షనిస్టు దగ్గరకి వెళ్ళాడు. విషయం ఏకరువు పెట్టాడు. పెదవి విరిచింది రిసెప్షనిస్టు.

"కరన్సన్ కంపెనీ వారు రేపటికి రూం బుక్ చేశారు. ఎడ్వాన్సుగా వచ్చి రూం కావాలంటే ఎలా? అంతగా అయితే ఈ రాత్రికి డబ్బు చెల్లించి మరో రూం తీసుకోండి. రేపు ఆ రూంలోకి మారుదురు గాని" అంది.

దు:ఖాన్ని దిగమింగుకుని మౌనంగా డబ్బు చెల్లించి మరో రూం తీసుకుని ముసుగు తన్నాడు. ఆ రాత్రి గడిచింది. మరునటి రోజు ఉదయమే రిసెప్షనిస్టు ఫోన్. గత నాలుగు రోజులుగా తీవ్రవాదుల ఆగడాలు ఎక్కువైనందున కర్ఫ్యూ విధించినట్లు ఈ స[illegible]యంలో బయటకు వెళ్ళరాదని చెప్పింది రిసెప్షనిస్టు. పైగా బయట మంచు తుఫాను. ఆ వాతావరణం ఎన్నాళ్ళుంటుందో తెలీదు.

ఆముదం తాగినట్లు పెట్టిన సుబ్బారావు మొహం చూసి ఏదో అడ్డంకి వచ్చిందని అర్థం చేసుకున్న అచ్యుతం నోరు మూసుకుని కిటికీ దగ్గర ఒక కుర్చీ వేసుకుని బయటకు చూస్తూ కూర్చుంది.

కర్ఫ్యూ, మంచుతుఫాను సుబ్బారావు చేతి చమురు బాగానే వదిలించాయి. హోటల్ వారిని బతిమాలుకుని ముందు ఢిల్లీకి ట్రెయిన్ టిక్కెట్లు తెప్పించుకుని బయలు దేరాడు.

ప్రయాణం అంతా భార్యతో మాట్లాడ లేదు. సుబ్బారావు అంత సీరియస్‌గా ఉండే సరికి అచ్యుతానికి మొదటి సారి భయం వేసింది. ఢిల్లీ నుండి హైదరాబాద్‌కు మరో ట్రెయిన్‌లో చేరుకుని ఆగమేఘాల మీద ఆటో ఎక్కాడు. ఇంటికి చేరేసరికి ఇంటి ముందున్న పెద్ద జనసమూహం సుబ్బారావుకి స్వాగతం పలికింది.

"బ్యాడ్ లక్ సార్. మీఇంట్లో నిన్న రాత్రి [illegible]ంగలు పడ్డారు . మీ టివి ఎత్తుకు పోయారు . [illegible]కా ఏం పోయాయెూ తెలీదు" చూసుకోండి అని చెప్పాడు పక్కింటి ముకుందం.

"ఏం వదినా! విమానప్రయాణం బాగా జరిగిందా?"అడిగింది పక్కింటి ముకుందం భార్య.

తెల్లమొహం వేసింది అచ్యుతం. భర్త నుండి ఎలాంటి ఛీత్కారాలు, తిట్లు ఎదుర్కోవాలోనని తలదించుకుని లగేజీ దించనారంభించింది. సుబ్బారావు ఒక్క ఉదుటున ఇంటిలోకి పరిగెత్తాడు.

ఇంట్లో ఒక ఏరియల్ తప్ప టివి కన్పించలేదు. ఇల్లంతా కలియ చూసాడు. ఇంట్లో సామానంతా చెల్లా చెదురుగా పడి ఉంది. ఎందుకో ఆ సీన్ చూడగానే సుబ్బారావుకి ఆనందమేసింది.

డబ్బు పోతే పోయింది. వెధవ టీవి పోయింది. దరిద్రం వదిలింది. ఆనందంతో బయటకి వచ్చాడు. అక్కడే రిపోర్టు రాసుకుంటున్న పోలీసులతో అన్నాడు.

"సార్ పోయిన వస్తువులన్నీ దొరికితే తెచ్చివ్వండి. ఒక్క టివి తప్ప. అది కనిపిస్తే మీరే దానిని తీసుకోండి సార్ "అంటూ పోలీసుల చేతులు పట్టుకు బతిమాలాడు సుబ్బారావు.